



RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ
USHASRI
తెలుగు దినపత్రిక

సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిష్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 65 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | శనివారం 16 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-


Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

# ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు

## దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్: సీఎం చంద్రబాబు

- పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (అమ్కా)
- భక్తి కేంద్రం ఇకపై దేశ భద్రతా కేంద్రంగా మారుతుందన్న సీఎం
- రికార్డు సమయంలో ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని వెల్లడి
- రాయలసీమను రత్నాలసీమగా మార్చడమే లక్ష్యమని స్పష్టీకరణ
- భారీగా పెట్టుబడులు, ఉద్యోగ కల్పనే ధ్యేయమన్న ముఖ్యమంత్రి





ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు నెలవైన పుట్టపర్తి గడ్డపై దేశ రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. దేశీయ పరిజ్ఞానంతో ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను తయారుచేసే ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (సూవీజూా - అమ్కా) ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో పుట్టపర్తి ఇకపై భక్తికే కాకుండా దేశ భద్రతకు కూడా కీలక చిరునామాగా మారుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.

**పుట్టపర్తిలో నూతన అధ్యాయం**

పుట్టపర్తి ఇకపై ఆధ్యాత్మిక స్ఫూర్తి నుంచి వ్యూహాత్మక ఆవిష్కరణల కేంద్రంగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అంకా' ప్రాజెక్టు ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామి అవుతుందని ఆయన తెలిపారు. ప్రాథమికంగా రూ. 15,803 కోట్ల వ్యయంతో 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా తొలిదశలో 7,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యుద్ధ విమానాలను తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**జెట్ స్పీడ్‌తో అనుమతులు**

ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు

ఆరోగ్య సమస్యల నుంచి కోలుకున్న తర్వాత మంగళగిరిలో జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్న పవన్ కళ్యాణ్ తన రాజకీయ ప్రయాణం, ఆరోగ్య సమస్యలు, పార్టీ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొన్నేళ్లుగా కరోనా తర్వాత లంగ్ ఇన్ఫెక్షన్, సైనస్ సమస్యలు, కంటి చూపులో ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. అభిమానులు ప్రేమతో లాగడంతో రెండు భుజాల కండరాలు దెబ్బతిన్నాయని భావోద్వేగంగా చెప్పారు. వెన్నెముకలో కూడా పలుచోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని వెల్లడించారు. గత ఎన్నికల విజయం తన ఒక్కడిదికాదని, ప్రతి జనసైనికుడు, వీరమహిళ కృషి ఫలితమని పేర్కొన్నారు. తమిళనాడులో విజయ్ విజయంతో తనను పోల్చవద్దని చెబుతూ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు భిన్నమని అన్నారు. పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కూటమి ప్రభుత్వంలో పార్టీ పాత్రను స్పష్టంగా నిర్వచించడం, జాతీయ స్థాయిలో పార్టీ విస్తరణపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. "మా ఊరికి నేనే పవన్ కళ్యాణ్" అని చెప్పే స్థాయిలో కార్యకర్తలు ఎదగడమే తన ఆశయమని, పార్టీ అసలు బలం క్షేత్రస్థాయి నాయకులేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు

## అండగా ఉంటానన్న నేతలు ఆ రోజు పారిపోయారు

- ఆరోగ్య సమస్యలతో పోరాడిన పవన్ కల్యాణ్
- అభిమానుల ప్రేమతో భుజాలకు గాయా లైనట్లు వెల్లడి
- జనసేన బలం క్షేత్రస్థాయి కార్యకర్తలేనన్న పవన్
- పార్టీ నిర్మాణంపై కీలక దిశానిర్దేశం చేసిన పవన్
- ఇతర నేతలతో తనను పోల్చవద్దన్న పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు.

**ఆరోగ్య సమస్యలపై తొలిసారిగా స్పందన:** గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం



# కీలక ఒప్పందాలపై సంతకాలు

- పశ్చిమాసియా సంక్షోభం వేళ యూఏఈలో ప్రధాని మోదీ పర్యటన
- ఇంధన భద్రత, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం
- ఎల్‌పీజీ, పెట్రోలియం నిల్వలపై కుదిరిన కీలక ఒప్పందాలు
- భారత్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు యూఏఈ అంగీకారం...
- గుజరాత్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు మరో కీలక ఎంఓయూ....

జాతీయం, ఉష శ్రీ



# ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'

**పుట్టపర్తిలో వేల కోట్ల విలువైన భారీ రక్షణ ప్రాజెక్టులకు శంకుస్థాపన**
**చంద్రబాబు నాయకత్వం, విజన్‌పై రాజ్ నాథ్ సింగ్ ప్రశంసల వర్షం**
**ఏపీని దేశానికే రక్షణ హబ్‌గా మార్చే ప్రణాళికలో భాగంగా కీలక అడుగులు**
**కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు 8 కంపెనీల సంయుక్త ప్రయత్నం**
**రక్షణ ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అపూర్వ వృద్ధి సాధించిందని వెల్లడి**

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్‌ను దేశ రక్షణ రంగ పటంలో అగ్రస్థానంలో నిలుపుతూ, రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రక అధ్యాయానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అనంతపురం జిల్లా పుట్టపర్తి వేదికగా శుక్రవారం వేల కోట్ల రూపాయల విలువైన నాలుగు కీలక రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి



# నేడు స్టెల్త్ ఫైటర్ జెట్

**పుట్టపర్తిలో ఏఎంసీఏ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన**
**ఉమ్మడి అనంతపురం చరిత్రను మార్చే ప్రాజెక్టు అని మంత్రి లోకేశ్**
**నాడు కియా కార్లు, నేడు ఫైటర్ జెట్లు చంద్రబాబు వల్లేనని వెల్లడి**
**వాళ్లది ఫ్యాక్షన్, మనది ఫైటర్ జెట్ అంటూ విపక్షాలపై చురకలు**
**ఈ ప్రాజెక్టుతో రాయలసీమ యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు**

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను మార్చే బృహత్తర ఘట్టానికి పుట్టపర్తిలో అంకురార్పణ జరిగిందని, ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) ప్రాజెక్టుతో ఈ ప్రాంతం భారతదేశ రక్షణ రంగంలో కొత్త శక్తి కేంద్రంగా మారబోతోందని రాష్ట్ర ఐటీ,



# ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు



చేసిన వేగాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనమని అన్నారు.

"ఈ ఏడాది 9వ తేదీన రక్షణ శాఖలో చర్చలు మొదలైతే, 20న ప్రతిపాదనలు అడిగారు. 24న మేం పంపాం, 28న కేంద్రం అంగీకరించింది. 29న అధికారులు స్థలాన్ని పరిశీలించి, 30న రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. జెట్ స్పీడ్‌తో ఫైటర్ జెట్ ప్రాజెక్టును సాధించాం" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర పోషించిన ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఏపీకి రక్షణ కవచం:** 'ఆమ్కా' ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఇతర రక్షణ, అనుబంధ పరిశ్రమల గురించి కూడా సీఎం ప్రస్తావించారు. మడకశిరలో భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, దొనకొండలో బీడీఎల్ సంస్థలు రూ.2,959 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని, దీనివల్ల 4-5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ద్వారా దేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకోసిస్టమ్‌కు శ్రీకారం చుట్టామని, రూ.686 కోట్ల పెట్టుబడులతో 8 సంస్థలు వస్తున్నాయని, తద్వారా 2,500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. శ్రీహరికోట నుంచి అంతరిక్ష శక్తి, నాగాయలంక నుంచి క్షిపణి శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తి, ఇప్పుడు పుట్టపర్తి నుంచి వైమానిక శక్తితో ఆంధ్రప్రదేశ్ దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు.


**రత్నాల సీమగా రాయలసీమ:** గతంలో కరవు సీమగా, రాళ్ల సీమగా పిలవబడిన రాయలసీమ రూపురేఖలు మారుస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయల కాలంలో వీధుల్లో రత్నాలు రాశులుగా పోసి అమ్మిన ఈ గడ్డను మళ్లీ రత్నాల సీమగా మార్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంది" అని ఆయన అన్నారు. పెనుకొండలో కియా పరిశ్రమ విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, కరువు సీమలో తయారైన కార్లు నేడు 80 దేశాల్లో తిరుగుతున్నాయని గుర్తుచేశారు. కడప స్టీల్ ప్లాంట్‌ను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ (జీ+ఖీ) ద్వారా త్వరలో బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుందని, రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను కూడా తీసుకువస్తామని చెప్పారు.

**నీటిపారుదల, పరిశ్రమలతో దశ మార్పు:** రాయలసీమ అభివృద్ధికి నీటిపారుదల ప్రాజెక్టులే పునాది అని చంద్రబాబు పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన హంద్రీనీవా, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. గొల్లపల్లి రిజర్వాయర్ వల్లే కియా మోటార్స్ రాగలిగిందని గుర్తుచేశారు. సమర్థవంతమైన నీటి నిర్వహణతో నేడు మే నెలలో కూడా పుట్టపర్తి చెరువు నిండుగా ఉందని, ఇది సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్టీల్, సిమెంట్ పరిశ్రమలను, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించి సీమ దశ మారుస్తామని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం:** గత ఐదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలను తరిమేసి, క్రిమినల్ రాజకీయాలు చేశారని విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రానికి మళ్లీ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని, వీటి ద్వారా 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**పొదుపు ఉద్యమానికి పిలుపు:** ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల (ఇరాన్-అమెరికా యుద్ధం) నేపథ్యంలో దేశ ఆర్థిక భద్రత కూడా ముఖ్యమని చంద్రబాబు అన్నారు. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన ఏడు సూత్రాల పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్, బంగారం కొనుగోళ్ల తగ్గింపు, ప్రజా రవాణా వినియోగం, వంట నూనెల వాడకం తగ్గింపు, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం వంటివి పాటించి దేశానికి అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం కూడా కాన్వాయ్‌లను తగ్గించడం వంటి చర్యలు చేపట్టిందని, ఈ పొదుపు ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# నేడు స్టెల్త్ ఫైటర్ జెట్



ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా రానున్న పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా 14కి 14 స్థానాల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించిందని, దానికి రిటర్న్ గిఫ్ట్‌గా ఈ ప్రాజెక్టును అందిస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. "నాడు కరవు నేలపై కియా కార్లు పరిగెత్తించిన విజనరీ చంద్రబాబు. నేడు అదే పుణ్యభూమిపై ఫైటర్ జెట్లు ఎగిరేలా చేస్తున్నది కూడా ఆయనే. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆశీస్సులతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోంది" అని ఆయన అన్నారు.

**నమో జోడితోనే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు :** ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడుల 'నమో జోడి' వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని లోకేశ్ తెలిపారు. "రూ.1.35 లక్షల కోట్ల గూగుల్ డేటా సెంటర్, రూ.1.35 లక్షల కోట్ల ఆర్సెలార్ మిట్టల్ పెట్టుబడులతో పాటు ఇప్పుడు పుట్టపర్తిలో లక్ష కోట్ల ఏఎంసీఏ ప్రాజెక్టు వచ్చింది. పోలవరం, అమరావతికి నిధులు, విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, కర్నూలుకు హైకోర్టు బెంచ్ వంటివన్నీ ఈ పవర్‌ఫుల్ కాంబినేషన్‌తోనే సాధ్యమయ్యాయి" అని వివరించారు. ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ అని ఆయన అభివర్ణించారు.

**యువతకు ఉపాధి.. అభివృద్ధిలో నెం.1 :** డీఆర్‌డీఓ, ఏడీఏ, హాల్ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టుతో 5వ తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను ఇక్కడ తయారు చేస్తారని లోకేశ్ తెలిపారు. భారత్ ఫోర్జ్, భారత్ డైనమిక్స్ వంటి అనేక దిగ్గజ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టనున్నాయని, తద్వారా ఈ ప్రాంత యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. "ఒక్క కియా పరిశ్రమతోనే అనంతపురం ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో నంబర్ వన్ కావడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం సీఎం చంద్రబాబు, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ ప్రత్యేకంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై తనదైన శైలిలో చురకలంటించిన లోకేశ్, "వాళ్లది ఫ్యాక్షన్ బ్యాక్‌గ్రౌండ్, మనది ఫైటర్ జెట్ బ్యాక్‌గ్రౌండ్. వాళ్లది కిడ్నాప్ బ్యాక్‌గ్రౌండ్, మనది కియా బ్యాక్‌గ్రౌండ్. రెండిటికీ చాలా తేడా ఉంది. అర్థమైందా రాజా?" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్రానికి ఈ ప్రాజెక్టును కేటాయించినందుకు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు



వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు. అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

**నన్ను ఇతరులతో పోల్చవద్దు:** తమిళనాడులో విజయ్ సాధించిన విజయంతో తనను పోల్చవద్దని పవన్ కల్యాణ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "పొరుగు రాష్ట్ర నేతలా మీరు కూడా చేసి ఉండాల్సింది అని చాలామంది సందేశాలు పంపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు వేరు. అదే పని 2019లో చేస్తే రెండుచోట్లా ఓడించారు కదా అండగా ఉంటానన్న నాయకులంతా ఆ రోజు పారిపోయారు. నాకు పదవి ముఖ్యం అనుకుంటే 2008లోనే ఎంపీగా పోటీ చేసేవాడిని, 2014లోనూ అవకాశం వచ్చింది. కానీ నాకు పార్టీని నిర్మించడం ముఖ్యం" అని స్పష్టం చేశారు.

**భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత:** రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ నాలుగు కీలక అంశాలను ప్రస్తావించారు.

1.పార్టీ నిర్మాణం: "ఒక పుష్కర కాలం (12 సంవత్సరాలు) తర్వాత పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాల్సిన సమయం వచ్చింది. ఇన్నాళ్లూ సిద్ధాంతాన్ని నమ్మి, ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడిన మీరే ఈ పార్టీకి పునాది. మిమ్మల్ని కేంద్రంగా చేసుకునే కొత్త నిర్మాణం ఉంటుంది" అని తెలిపారు.

2.భావజాలం: జనసేన ఏడు సిద్ధాంతాలను కార్యకర్తలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

3.పొత్తు ధర్మం, భవిష్యత్ మార్గం: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో జనసేన పాత్ర ఎలా ఉండబోతోందో వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా స్పష్టత ఇచ్చారు.

4.జాతీయ స్థాయిలో పాత్ర: ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా జనసేన ఎలా ముందుకు సాగాలో, ఇతర రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను ఎలా సమన్వయం చేసుకోవాలో వివరిస్తానని చెప్పారు.

**క్షేత్రస్థాయి నాయకులే పార్టీ బలం:** పార్టీ బలం తాను కాదని, క్షేత్రస్థాయిలోని కార్యకర్తలేనని పవన్ పునరుద్ఘాటించారు. "ఒకప్పుడు 150 మందితో మొదలైన పార్టీలో ఇప్పుడు 21.5 లక్షల మంది జనసైనికులు, వీరమహిళలు ఉన్నారు. మిమ్మల్ని 'సాధకులు' అని పిలవాలనుకుంటున్నాను. లక్ష్యాన్ని సాధించేవారే సాధకులు. 'మా ఊరికి నేనే పవన్ కల్యాణ్' అని వైజాగ్‌లో ఒక జనసైనికుడు చెప్పినప్పుడు, నేను కోరుకున్న పార్టీ నిర్మాణం ఇదే అనిపించింది," అని అన్నారు. విజయనగరంలో 'మంగళవారం హుసేన్', నక్సలిజం వీడి ఉపసర్పంచ్ అయిన అరకు యువకుడు బాబూరావు వంటి ఎందరో స్ఫూర్తిదాయక కార్యకర్తలే జనసేన నిజమైన బలమని కొనియాడారు. "ఈ విజయం ఉమ్మడి పోరాటం వల్లే సాధ్యమైంది. ఈ గెలుపులో నాకు ఎంత వాటా ఉందో, మీ అందరికీ అంతే సమానమైన వాటా ఉంది. మీరంతా లేకపోతే నేను ఎవరిని ప్రేమిస్తాను? నన్ను వీడని నా జనసైనికులు, వీరమహిళలే నా బలం" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కూడా జనసేన ప్రతినిధులు హాజరయ్యారు.

# ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'

శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా, యావత్ భారత రక్షణ రంగ స్వావలంబన ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**చంద్రబాబు విజన్‌పై ప్రశంసల జల్లు:** ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, పాలనా సామర్థ్యంపై ప్రశంసల వర్షం కురిపించారు. "నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎందరో నాయకులను చూశాను. కానీ, టెక్నాలజీ పట్ల చంద్రబాబుకు ఉన్న పట్టు, అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత, భవిష్యత్తును అంచనా వేయగల ఆయన దూరదృష్టి చాలా అరుదుగా కనిపిస్తుంది. ఆయన ఆలోచనలు ఎప్పుడూ చిన్నవిగా ఉండవు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషికి కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయ వేదికలపైనా ప్రశంసలు దక్కాయి" అని కొనియాడారు. గూగుల్ వంటి బహుళజాతి సంస్థ తన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఏపీని ఎంచుకోవడమే చంద్రబాబు సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. "చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'గా ఎదుగుతుందన్న పూర్తి విశ్వాసం నాకుంది" అని రాజ్ నాథ్ ధీమా వ్యక్తం చేశారు.

**వేల కోట్ల పెట్టుబడులతో కీలక ప్రాజెక్టులు:** పుట్టపర్తిలో ప్రారంభమైన ప్రాజెక్టుల వివరాలను రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు భారత సైన్యం, వాయుసేన, నౌకాదళం.. ఇలా త్రివిధ దళాల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని వివరించారు.


1.అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఖావీజూ) కేంద్రం: ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఖాణజూ) ఆధ్వర్యంలో, రూ.15,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఐదో తరం యుద్ధ విమానం 'అమ్కా' ప్రాజెక్టులో భాగంగా రూ.2,000 కోట్లతో కోర్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాన్ని పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి అత్యాధునిక సదుపాయం ప్రపంచంలోనే అతి కొద్ది ప్రదేశాల్లో ఉందని, ఇకపై ఆ జాబితాలో పుట్టపర్తి పేరు చేరనుందని అన్నారు.

2.భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (దీణా) యూనిట్: రూ.480 కోట్లతో బీడీఎల్ ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రంలో అత్యాధునిక అండర్‌వాటర్ సిస్టమ్స్, అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, నెక్స్ట్ జనరేషన్ టార్పెడోలు తయారు చేస్తారు. ఇది మన నౌకాదళ సామర్థ్యాన్ని, బ్లూ ఎకానమీని బలోపేతం చేస్తుంది.

3.భారత్ ఫోర్జ్ (ఆగ్నేయ) యూనిట్: భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన ఆగ్నేయ ఎనర్జిటిక్స్, రూ.1,500 కోట్ల పెట్టుబడితో అధునాతన ఆయుధాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతోంది.

4. హెచ్ ఎఫ్ సీఎల్ (ఞఖీజా) ఫ్యూజ్ ప్లాంట్: రూ.1,294 కోట్ల పెట్టుబడితో హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఞఖీజా) ఆర్టిలరీ షెల్స్, బాంబులకు అవసరమైన ఎలక్ట్రికల్ ఫ్యూజ్‌ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటితో పాటు, 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో ఒక 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేస్తున్నాయని, భవిష్యత్తులో ఈ ప్రాంతం ప్రపంచ డ్రోన్ హబ్‌గా మారుతుందని రాజ్ నాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**'ఆత్మనిర్భర్ భారత్' దిశగా పయనం:** గత పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రక్షణ రంగం స్వరూపం పూర్తిగా మారిపోయిందని రాజ్ నాథ్ అన్నారు. "2014లో మన దేశీయ రక్షణ ఉత్పత్తి కేవలం రూ.46,000 కోట్లు. నేడు అది రికార్డు స్థాయిలో రూ.1.54 లక్షల కోట్లకు చేరింది, త్వరలోనే రూ.1.75 లక్షల కోట్లను దాటుతుంది. ఒకప్పుడు రూ.600 కోట్ల లోపు ఉన్న మన రక్షణ ఎగుమతులు, నేడు సుమారు రూ.40,000 కోట్లకు చేరుకున్నాయి. ఇది మన స్వావలంబన ప్రయాణానికి నిదర్శనం" అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులు కేవలం రక్షణ రంగానికే పరిమితం కాకుండా, లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఒక సంపూర్ణ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసి, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. బెంగళూరుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతాన్ని కర్ణాటకతో కలిసి ఒక భారీ 'మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్'గా తీర్చిదిద్దే ప్రణాళికపై ఆలోచించాలని ఆయన చంద్రబాబుకు సూచించారు. దేశ నిర్మాణం అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమని, ఈ చారిత్రక కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన బృందానికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# కీలక ఒప్పందాలపై సంతకాలు

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటిస్తున్నారు. దేశంలో నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన తరుణంలోనే ఈ పర్యటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకోవడం, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. అబుదాబిలో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, రక్షణ సహకారం, ప్రజా సంబంధాలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ), వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి రెండు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలపై (ఎంఓయూ) సంతకాలు జరిగాయి. వీటితో పాటు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌పైనా అంగీకారానికి వచ్చారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వడినార్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయూపైనా సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలతో పాటు భారత మౌలిక సదుపాయాలు, ఆర్‌బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. ఇది భారత్ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ జరిపిన దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామిగా ఉన్న యూఏఈతో ఈ తాజా ఒప్పందాలు వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చనున్నాయి. సుమారు 45 లక్షల మందికి పైగా భారతీయులు నివసిస్తున్న యూఏఈలో వారి సంక్షేమం గురించి కూడా ఈ పర్యటనలో చర్చకు వచ్చింది. ప్రస్తుత సంక్షోభ సమయంలోనూ యూఏఈ భారత్‌కు అత్యంత నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతుండటం గమనార్హం.



# ఇంద్రకీలాద్రిపై అలరించిన కూచిపూడి నృత్య వైభవం

**'ధర్మపథం' కార్యక్రమంలో భక్తులను మంత్ర ముగ్ధులను చేసిన కళాకారులు**



**ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ )మే 15:** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ధర్మపథం' సాంస్కృతిక కార్యక్రమం శుక్రవారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రామచంద్రాపురం నుంచి విచ్చేసిన 'శ్రీ లలిత కూచిపూడి నాట్యాలయం' కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. గురువు వి. లలిత నాయుడు ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా 'అయిగిరి నందిని' నృత్యంలో అమ్మవారి ఉగ్రరూపాన్ని, 'నవదుర్గలు' ప్రదర్శనలో దేవి తొమ్మిది అవతారాలను కళాకారులు అద్భుతమైన అభినయంతో ఆవిష్కరించారు. 'అష్టలక్ష్మీ నృత్యం', 'నరసింహ కౌతం' వంటి ప్రత్యేక నృత్య రూపకాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ నృత్య ప్రదర్శనలను భక్తులు తన్మయత్వంతో వీక్షించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సాంస్కృతిక కార్యక్రమం ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభను మరింత పెంచిందని భక్తులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆలయ అధికారులు కళాకారులను సత్కరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ నృత్య వైభవాన్ని ఆస్వాదించారు.

# పసిబిడ్డను అమ్మేందుకు యత్నం కేసు

**నలుగురు నిందితులకు ఏడాది జైలు శిక్ష విధించిన కోర్టు**

**విజయవాడ, కమిషనరేట్ (ఉషశ్రీ) మే 15:** 20 రోజుల పసిబిడ్డను అమ్మేందుకు ప్రయత్నించిన కేసులో నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ విజయవాడ చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది. కమిషనరేట్ పరిధిలోని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో 2017 సెప్టెంబర్ 1న నమోదైన ఈ కేసులో నిందితులపై జువెనైల్ జస్టిస్ చట్టం 2015లోని సెక్షన్ 81 కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితురాలు తన కూతురికి మరో వివాహం చేయాలనే ఉద్దేశంతో, ఆమెకు పుట్టిన 20 రోజుల పసిబిడ్డను మరో ముగ్గురు సహకారంతో విక్రయించేందుకు ప్రయత్నించింది. ఈ ఘటన పాత రాజరాజేశ్వరి పేట ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. కేసులో నిందితులుగా ఉన్న జి.కొండూరు గ్రామానికి చెందిన బాడీసా నాగమణి (44), సత్యనారాయణపురానికి చెందిన ఉమ్మడి సువార్త (47), గోనూరు శ్రీనివాసరావు (49), ముత్యాలంపాడుకు చెందిన రాణిమెకల బాజీ (39)లపై నేరం రుజువుకావడంతో, చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ శ్రీమతి బి. రాధారాణి ఒక్కొక్కరికి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో అప్పటి కొత్తపేట ఎస్ఐ ఎన్.ఎల్.ఎన్.మూర్తి నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. శివప్రసాద్ వాదనలు వినిపించగా, సి.ఎం.ఎస్ ఇన్‌స్పెక్టర్ పి. జగదీశ్వరరావు, ప్రస్తుత కొత్తపేట ఇన్‌స్పెక్టర్ చిన్న కొండలరావు పర్యవేక్షణలో మొత్తం ఎనిమిది మంది సాక్షులను విచారించారు.

# "బడి పిలుస్తోంది" చైతన్య రథయాత్రకు విశేష స్పందన

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రజల్లో అవగాహన**




**విజయవాడ,(ఉషశ్రీ)మే 15:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు చేపట్టిన "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన చైతన్య విద్యా రథయాత్రకు విశేష స్పందన లభించింది. జీఎన్ఆర్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్, డీఎస్ఎం హైస్కూల్, భవానిపురం, ఎస్ఎంఏకే హైస్కూల్, స్వాతి సెంటర్, ఊర్మిళానగర్, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్ట్, కేఎల్‌రావునగర్, అన్నపూర్ణాదేవి పాఠశాల, కొత్తపేట ఎస్కేపీవీ హిందూ పాఠశాల, ఎంఏఎంసీ పాఠశాల మీదుగా గాంధీజీ పాఠశాల వరకు కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్య, ఆధునిక సౌకర్యాలు, మెరుగైన మౌలిక వసతులు, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ చైతన్య రథయాత్రలో విజయవాడ వెస్ట్ మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా సెక్టోరియల్ అధికారులు, సమగ్ర శిక్ష సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ పేరుతో ఓటీపీ మోసాలు.. అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, (ఉషశ్రీ )మే 15:** ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. గ్యాస్ బుక్ చేశామని, సబ్సిడీ వస్తుందని, లేదా కనెక్షన్ అప్డేట్ చేయాలని చెప్పి వినియోగదారుల మొబైల్‌కు ఓటీపీలు పంపిస్తున్నారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ఇంటికి వచ్చినప్పుడు మాత్రమే డెలివరీ బాయ్‌కు ఓటీపీ చెప్పాలని, ఫోన్ ద్వారా ఎవరైనా అడిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ వెల్లడించవద్దని సూచించారు. ఓటీపీ చెప్పిన వెంటనే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయమయ్యే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎవరైనా మోసపోయినట్లయితే వెంటనే 9154970454 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలు కూడా వినియోగదారులకు అవగాహన కల్పించాలని, డెలివరీ సమయంలో మాత్రమే ఓటీపీ అవసరమని స్పష్టం చేయాలని కలెక్టర్ కోరారు.

# పాఠశాల సంసిద్ధత ఉత్సవం మరియు గ్రాడ్యుయేషన్ డే

**కార్యక్రమం నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు**



**గిద్దలూరు, ఉషశ్రీ:** అంగన్వాడిలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న పిల్లలందరికీ పాఠశాల సంసిద్ధత ఉత్సవం మరియు గ్రాడ్యుయేషన్ డే. గిద్దలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టులో పాఠశాల సంసిద్ధత కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి మరియు ఐటీసీ ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వెంకట్రావు ఆధ్వర్యంలో గర్ల్స్ హైస్కూల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సీతారామయ్య ఐసిడిఎస్ గిద్దలూరు ప్రాజెక్టు సిడిపిఓ కే మహిత హాజరయ్యారు. బాల బాలికలకు కిషోర్ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల సంసిద్ధత మేళా యొక్క ముఖ్య ఉద్దేశం ఆటపాటల ఆధారిత కార్యకలాపాల ద్వారా పిల్లల అభివృద్ధిని తల్లిదండ్రుల సమక్షంలో అంచనా వేసి వారి యొక్క అభివృద్ధి స్థాయిలను గురించి తల్లిదండ్రులు అవగాహన పెంపొందించడం మరియు పిల్లలను పాఠశాలకు సమగ్ర అభివృద్ధిలో సంసిద్ధులను చేయడం. పిల్లలను పాఠశాలలకు సిద్ధం చేయడంలో తల్లిదండ్రులు సంరక్షకులు ముఖ్యంగా తల్లులను భాగస్వాములను చేయడం పిల్లల స్థాయిలను మరియు వారి అ బ.ˇ య సˇ నా ని మెరుగుపరచడానికి తగిన సహాయం చేయించడం అని అన్నారు. అంగన్వాడీలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొని ఎలిమెంటరీ స్కూల్ కి వెళ్లబోతున్న పిల్లలకు అభివృద్ధిలో వారీగా తల్లిదండ్రుల సమక్షంలో అసెస్మెంట్ నిర్వహించారు . అంగన్వాడీలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న పిల్లలందరికీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్నీ నిర్వహించి పిల్లలందరికీ సర్టిఫికెట్లు అందించారు. కిషోరీ వికాసం కార్యక్రమంలో భాగంగా ఈరోజు అంశం అయిన లైంగిక మరియు పునరుత్పత్తి,ఆరోగ్యం మరియు హెచ్ఐవి ఎయిడ్స్ అంశాల మీద గ్రూపుల వారీగా కృత్యాలను చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సీతారామయ్య,సిడిపిఓ కే మహిత, ఐటీసీ ప్రథమ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్ వెంకట్రవు,సూపర్వైజర్ బి జ్యోతి, గర్ల్స్ హై స్కూల్ గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్టర్,అంగన్వాడీ టీచర్లు మరియు ప్రీస్కూల్ తల్లితండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే ముత్తుము.



**గిద్దలూరు, ఉషశ్రీ :** మార్కాపురంజిల్లా .గిద్దలూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ కార్యక్రమాలు, రైతు సంక్షేమ పథకాలు మరియు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, పచ్చి ఎరువు విత్తనాల పంపిణీ, ఖరీఫ్‌కు అవసరమైన ఎరువుల నిల్వలు, ఖరీఫ్ 2026-27 కార్యాచరణ ప్రణాళిక, కె . పి.ఐ.లక్ష్యాల సాధన, ఎ.పి.ఎ . ఐ.ఎం.ఎస్.రైతు యాప్ నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అలాగే పంట మార్పిడి, పంట దిగుబడి పెంపు చర్యలు, సేంద్రియ ఎరువుల వినియోగం, భూసార పరిరక్షణ మరియు సహజ వ్యవసాయ విధానాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులు సాంకేతికంగా పురోగతి చెందేందుకు ప్రవేశపెట్టిన ఎ.పి.ఎ . ఐ.ఎం.ఎస్ రైతు యాప్‌లో ప్రతి రైతు నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రైతు భరోసా కేంద్రాల (ఆర్. కె. బి. ఎస్) ద్వారా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా నమోదు కాని రైతులను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. రైతులకు యాప్ వినియోగం, పంట నమోదు, సబ్సిడీలు మరియు ఇతర సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలియజేశారు. అలాగే వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ విధానంపై కూడా అధికారులతో సమీక్షించారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, దరఖాస్తుల పరిశీలన అనంతరం లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన నాన్-సబ్సిడీ మొత్తాన్ని చెల్లించే విధానము తదుపరి యంత్ర పరికరాలు అందజేయుట గురించి చర్చించారు.పారదర్శకతతో అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్లు బాలాజీ నాయక్ ,శ్రీమతి రాజశ్రీ మరియు మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తుల సౌకర్యాలు, పరిశుభ్రతపై ఈవో సమీక్ష

- అధికారులకు కీలక ఆదేశాలు
- ఘాట్ రోడ్డు బలోపేత పనులకు ప్రణాళిక



**ఇంద్రకీలాద్రి,(ఉషశ్రీ)మే 15 :** భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)తో కలిసి శుక్రవారం మహా మండపం 4వ అంతస్తులో ఇంజినీరింగ్, శానిటేషన్ తదితర విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా ఘాట్ స్నానాల రేవు నుంచి కనకదుర్గ నగర్, ఘాట్ రోడ్డు, మహా మండపం సహా ఆలయ ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉంచాలని ఈవో స్పష్టం చేశారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘాట్ రోడ్డు టోల్ గేట్ నుంచి 'ఓం' టర్నింగ్ వరకు రోడ్డు బలోపేత పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పనుల సమయంలో కొన్ని రోజుల పాటు ఘాట్ రోడ్డును మూసివేసే అవకాశం ఉన్నందున, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుం డా కనకదుర్గ నగర్‌లో ప్రత్యామ్నాయ వసతులు మెరుగు పర్చాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని ఈవో ఆదేశించారు. ఏఈలు, డీఈలు సమన్వయంతో వ్యవహరిస్తూ సాంకేతిక సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నప్రసాదాల నాణ్యతను పెంచి భక్తులకు శుచిగా, రుచికరంగా భోజనం అందించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఆలయ పరిసరాల్లో తాగునీటి సదుపాయం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఈవో శీనా నాయక్ పేర్కొన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జలవనరుల ఆక్రమణలకు చెక్

**కాలువలు, చెరువుల పరిరక్షణకు సమన్వయ చర్యలు**



**విజయవాడ,(ఉషశ్రీ )మే 15:** జల వనరుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాలువలు, చెరువులు, కుంటలు తదితర నీటి వనరులపై జరుగుతున్న ఆక్రమణలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించే తనిఖీలు, సమగ్ర నివేదికలు భవిష్యత్ కార్యాచరణకు కీలకమని పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ, ఆక్రమణల గుర్తింపు, తొలగింపుపై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా జలవనరుల పరిరక్షణకు సంబంధించి ఏపీ హైకోర్టులో 2024లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కూడా చర్చించారు. జలవనరుల ఆక్రమణల వల్ల పర్యావరణ సమస్యలు పెరగడంతో పాటు వరద ముప్పు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాలువలు, డ్రైన్లు, చెరువులు తదితర జలవనరుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీలు, సర్వేలు నిర్వహించి వాటి నివేదికలను పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో కొత్త ఆక్రమణలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీసీపీ కేజీవీ సరిత, డీఆర్‌వో ఎం. లక్ష్మీనరసింహం, డీపీవో పి. లావణ్యకుమారి, ఇరిగేషన్ స్పెషల్ డివిజన్ ఈఈ బి. ఆంజనేయ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి






- విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో 22 అర్జీలు స్వీకరణ
- జిల్లా రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి

**భీమవరం: (ఉషాశ్రీ)మే 15:** విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో అధికారులు సేవాభావంతో స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన దివ్యాంగుల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన పిటిషన్లు స్వీకరించబడినట్లు డిఆర్ఓ తెలిపారు. ఈ ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో మొత్తం 22 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. వీటిలో ఇండ్ల స్థలాలు, గృహ మంజూరు, వికలాంగుల పెన్షన్లు, ఆరోగ్య సమస్యలు, వైద్య సహాయం, ఉపాధి అవకాశాలు, ప్రస్తుతం అందుతున్న పెన్షన్‌ను రూ.15 వేల వరకు పెంచాలని చేసిన వినతులు ప్రధానంగా ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల నుండి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు రావడానికి దివ్యాంగులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సేవాభావంతో స్పందించి సమస్యలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉపాధి అవకాశాల కోసం వచ్చిన దరఖాస్తులపై స్పందిస్తూ, నిరుద్యోగ దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అర్హత మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చెవిటితనంతో బాధపడుతున్న విస్సాకోడేరు గ్రామానికి చెందిన రెడ్డి రామకృష్ణకు జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ చేతుల మీదుగా చెవిటి యంత్రాన్ని అందజేశారు.

**పీజీఆర్ఎస్‌లో అందిన ముఖ్య అర్జీలు :** భీమవరం పట్టణానికి చెందిన జి.రాజేష్‌తో పాటు మరో ఆరుగురు అంధులు ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి భీమవరం పట్టణానికి వచ్చి అద్దె ఇంటిలో నివసిస్తున్నామని, తమకు సొంత ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాళ్ల గ్రామానికి చెందిన వి.బలరామకృష్ణ నాయకర్ మూడు చక్రాల బండిపై ఫోటో మిషన్ ఏర్పాటు చేసుకుని పర్యాటక ప్రాంతాల్లో ఫోటోలు, ఫ్రేమ్ వర్క్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పేరుపాలెం బీచ్‌లో యూనియన్ సభ్యులు అభ్యంతరం తెలుపుతున్నందున అక్కడ వ్యాపారం నిర్వహించేందుకు అనుమతి కల్పించాలని కోరారు. భీమవరం పట్టణానికి చెందిన వై.నాగలక్ష్మి అనే వికలాంగురాలు తనకు ఒకటిన్నర సెంట్ల ఇల్లు ఉన్న కారణంగా వికలాంగుల పెన్షన్ మరియు "తల్లికి వందనం" పథకం నిలిపివేశారని తెలిపారు. తాము కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నందున తిరిగి పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆకివీడు గ్రామానికి చెందిన తాళ్ల ప్రసాద్ తన తండ్రి పక్షవాతంతో మంచానికే పరిమితమై ఉన్నారని, ఆయనకు 87 శాతం వికలాంగ ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ ప్రస్తుతం అందుతున్న రూ.4 వేల పెన్షన్‌ను రూ.15 వేల వరకు పెంచాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా భూముల రీ-సర్వే పనులను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి
- రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని భూముల రీ-సర్వే పనులను వేగవంతంగా, పారదర్శకంగా మరియు నిబద్ధతతో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు



**ఆచంట (వల్లూరు): (ఉషశ్రీ)మే 15:** ఆచంట మండలం వల్లూరు గ్రామాన్ని శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సందర్శించి, రైతుల భూముల సరిహద్దు రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూ సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భూముల రీ-సర్వే ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత పారదర్శకంగా రీ-సర్వే పనులను నిర్వహించాలని సూచించారు. భూమి సరిహద్దుల నిర్ధారణ, భూ వివరాల నమోదు, సర్వే ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూముల సర్వే సందర్భంగా రైతులకు సరైన సమాచారం అందిస్తూ, వారి అభ్యంతరాలను వినిపించే అవకాశం కల్పించాలని తెలిపారు. రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భూ సర్వే పనుల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూములకు సంబంధించి తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు, జిల్లా భూ సర్వే అధికారి కె.జాషువా, ఇంచార్జ్ తహసీల్దార్ ఆర్.రాజ్యలక్ష్మి, మండల సర్వేయర్ యోగేంద్ర, వీఆర్వో జి.అప్పారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పీజీఆర్ఎస్‌తో ప్రజలకు చేరువగా పాలన



**జి.కొండూరు,(ఉషశ్రీ )మే 15:** ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 83 అర్జీలు అందగా, వాటిని నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు, పింఛన్లు, రేషన్, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలకు స్థానికంగానే పరిష్కారం చూపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.

## "బడిలో అడుగు.. జీవితానికి వెలుగు"

**జి.కొండూరు, (ఉషశ్రీ)మే 15:** ప్రతి చిన్నారి తప్పనిసరిగా బడిలో చేరేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. కుంటముక్కల గ్రామంలో నిర్వహించిన "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, డిజిటల్ సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు అందిస్తున్నామని తెలిపారు. ఇంటింటి ప్రచారం ద్వారా విద్యపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో ఎల్. చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## జూలైలో జరిగే ఏఐటిటి పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, మే 15:** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జూలై-2026లో నిర్వహించనున్న ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటిటి) పరీక్షలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ఎన్‌సీవీటీ, ఎస్‌సీవీటీ పరిధిలో క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ (జూ) కింద నిర్వహించబడనున్నాయి. 2024-26 విద్యా సంవత్సరానికి చెందిన రెండేళ్ల కోర్సుల రెండో సంవత్సరం విద్యార్థులు, 2025-27 విద్యా సంవత్సరానికి చెందిన రెండేళ్ల కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులు, అలాగే 2025-26 సంవత్సరానికి చెందిన ఒక సంవత్సరం మరియు ఆరు నెలల కోర్సుల విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులని పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్ష ఫీజుగా రెగ్యులర్ ట్రైనీలకు రూ.100 నిర్ణయించారు. అభ్యర్థులు తాము చదివిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐల ప్రధానాచార్యులకు నగదు రూపంలో ఫీజు చెల్లించి రసీదు పొందాలని సూచించారు. ఫైన్ లేకుండా ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ జూన్ 15 కాగా, రూ.10 ఆలస్య రుసుముతో జూన్ 20 వరకు అవకాశం కల్పించారు. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ఐటీఐ/ఐటీసీ ప్రధానాచార్యులకు జూన్ 20 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని డైరెక్టర్ తెలిపారు.

## రైతు బాంధవుడు కాటన్ దొర :ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం: (ఉషశ్రీ) మే 15:** గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించిన కాటన్ దొర రైతుబాంధవుడని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక పడాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం కాటన్ దొర జయంతిని నిర్వహించారు. కాటన్ దొర విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జిల్లాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి,ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ ఈ ప్రాంత ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. గత ప్రభుత్వాలు కాటన్ నిర్మించిన డెల్టా వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్ల కాలువలు పూర్తిస్థాయిలో ప్రవాహం లేక శివారు ప్రాంతాల గ్రామాలకు సాగునీరు చేరడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డెల్టా వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ వహించి మరమ్మతులు చేపట్టామని తెలిపారు.విదేశీయుడైనా కాటన్ మహాశయుడిని ఇప్పటికీ ప్రజలు గుర్తు పెట్టుకుని దేవుడిలా ఆరాధించటం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, చాపల రమేష్, మద్దాల మణికుమార్,కామిశెట్టి శ్రీనివాస్,వాడపల్లి సుబ్బరాజు, పసల కొండ, కొనగళ్ల హరనాథ్, రామ లక్ష్మణ్, బైనపాలేపు ముఖేష్, పసల కొండ, నేలపాల నీలపాల దినేష్ యాదవ్ దితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- "బడి పిలుస్తోంది" గోడపత్రిక ఆవిష్కరణ
- ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయ






**ఆచంట: (ఉషశ్రీ)మే 15:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికను పెంచేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, మండల మరియు జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో ప్రత్యేక కృషి చేయాలని ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట బాలంవారి పాలెంలోని పి-4 భవనంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ -- సమగ్ర శిక్ష పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన "బడి పిలుస్తోంది" గోడపత్రికను ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ దాసిరాజు, సీపీఓ వై.దోసిరెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, నేడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టి కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందన్నారు. విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫార్ములు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, నైపుణ్యవంతులైన ఉపాధ్యాయుల బోధన, విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలపై తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులను చైతన్యపరచాలని అధికారులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. "బడి పిలుస్తోంది" కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్.అప్పారావు, డిఆర్డిఏ పీడీ వేణుగోపాల్, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ వాత్సల్య స్కీమ్ అమలుపై జాయింట్ కలెక్టర్ సమీక్ష

**విజయవాడ, (ఉషశ్రీ )మే 5:** ఎన్టీఆర్ జిల్లాలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య స్కీమ్‌పై జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఎస్. ఇలాక్కియా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారి శ్రీమతి షేక్ రుక్సానా సుల్తాన బేగం జిల్లాలో అమలవుతున్న మిషన్ వాత్సల్య కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం. రాజేశ్వరరావు 2025-26 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిరాశ్రయ బాలలకు ఆర్ఫన్ సర్టిఫికెట్లు అందజేయడం, ఫోస్టర్ కేర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, బాల్య వివాహాల నివారణలో వివిధ శాఖలను భాగస్వామ్యులను చేయడం, జిల్లా బాలికల కోసం ప్రత్యేక షెల్టర్ హోమ్ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, సీడీపీఓలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, డీపీవో, బాలల సంరక్షణ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన కూటమి నేతలు



**అమలాపురం, మే 15 ( ఉష శ్రీ ప్రతినిధి ):** ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామంలో జనసేన నాయకులు యర్రంశెట్టి కృష్ణ ఏర్పాటు చేసిన ద్రాక్ష జ్యూస్ చలివేంద్రం ను కూటమి నాయకులు ఏఎంసీ డైరెక్టర్ మూర్త సత్తిబాబు, పీఏసీఎస్ చైర్మన్ నల్లా శ్రీను, బీజేపీ మండల అధ్యక్షులు యనమదల వెంకటరమణ, నల్లా గణేష్ శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళు అధ్వాన్నంగా ఉన్న ముక్తేశ్వరం-కె.జగన్నాథపురం ప్రధాన రహదారిని ఎమ్మెల్యే నిర్మించి సత్తా చాటుకున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్దే తన అజెండా కృషి చేసి ఈరోజు నియోజకవర్గాన్ని నెంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.

# ఆకివీడులో సీఐ స్పెషల్ డ్రైవ్



**ఆకివీడు: (ఉషశ్రీ) మే 15 :** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న మోటార్ సైకిల్ వాహనాలపై సీఐ కాళీ చరణ్ కొరడా ఝులిపించారు.. శుక్రవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలు వాహనాలకు ఫైన్లు విధించారు. జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. ఇకపై నెంబర్ ప్లేట్ లేకుండా వాహనం కనిపిస్తే వెంటనే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆకివీడు ఎస్ టర్నింగ్ వద్దనుండి వైయస్సార్ సెంటర్ వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు రహదారిపైకి వచ్చిన ఆక్రమణలను నగర పంచాయతీ సిబ్బంది తో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు ఎస్సై హనుమంతు నాగరాజు, శానిటైస్ ఇన్స్పెక్టర్ సాకేత్ బాబు, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్, మరియు మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ కాటన్ దొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు



**ఆకివీడు: (ఉషశ్రీ) మే 15:** అపర భగీరథుడు సర్దార్ కాటన్ దొర జయంతి సందర్భంగా ఆకివీడు దుంపగడప కాటన్ పార్కు వద్ద ఉన్నటువంటి సర్దార్ కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోదావరి నదిపై ధవలేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించిన కాటన్ దొర రైతు బాంధవుడు అని అన్నారు. గోదావరి జిల్లాల రైతులకు సాగునీరు, ప్రజలకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన మహానీయుడు కాటన్ దొర ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గంధం ఉమా, నౌకట్ల రామారావు, అజ్మల్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఇంధనం, గ్యాస్‌కు కొరత లేదు - ప్రజలు ఆందోళన చెందవద్దు



**( రాజమహేంద్రవరం )** తూర్పుగోదావరి జిల్లాలో పెట్రోల్, డీజిల్ మరియు గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్(పౌర సరఫరాలు)/జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 199 పెట్రోల్ బంకుల ద్వారా ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిల్వల పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే స్టాక్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని 52 గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా కూడా సాధారణంగా కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం రోజుకు సగటున 10,500 బుకింగ్‌లు నమోదు అవుతుండగా, 12,500 సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు నాటికి 22,602 సిలిండర్లు నిల్వలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అధిక ధరలకు ఇంధనం లేదా గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేయవద్దని సూచించారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు 228 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని 104 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలపై ఫిర్యాదులు లేదా సమాచారం కోసం జిల్లా కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నంబర్ 8074661259 ను సంప్రదించాలని కోరారు.

# ఎర్రకాలువ పనులు త్వరలో పూర్తి చేస్తాం :ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం: (ఉషశ్రీ) మే 15:** ఎర్ర కాలువ ఆధునికీకరణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం, అప్పారావు పేట గ్రామాల్లో జరుగుతున్న ఎర్రకాలువ మరమ్మతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలో ఎక్కడా లోపాలు లేకుండా పనులు జరిగే విధంగా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. నాణ్యతలేని అరకొర పనుల వల్ల తరచుగా గండ్లు పడుతున్నాయన్నారు. స్థానిక రైతులు, ప్రజలు పనుల నాణ్యతను పరిశీలించాలని కోరారు. వీరంపాలెం,అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం తదితర గ్రామాల మీదుగా ప్రవహించే ఎర్రకాలువ పరిసర ప్రాంత పంటలు ప్రతి సంవత్సరం వానాకాలంలో ముంపుకు గురవుతున్నాయని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యను అధ్యయనం చేశామని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి శాసనసభలో [illegible] చర్చించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి రామానాయుడు ల సహకారంతో ఎర్రకాలువ ఆధునీకరణకు రూ. 2.70కోట్లు మంజూరయ్యాయని,ప్రస్తుతం రూ. 67లక్షల తో ఈ పనులు చేస్తున్నామని తెలిపారు. మాధవరం నుంచి నిడదవోలు వైపు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 9 కోట్లు అంచనా వ్యయం అవుతుందని అన్నారు. నిధుల కొరత కారణంగా ఆలస్యమవుతుందన్నారు. మంత్రి దుర్గేష్ తోఈ అంశం చర్చించామని త్వరలోనే నిధులు మంజూరవుతాయని అన్నారు. ప్రస్తుతానికి 18లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. కాలువగట్టుకు మలుపుల వద్ద 6చోట్ల గండ్లు పడ్డాయని వాటిని పూడ్చి గట్టు పటిష్టం చేస్తామని అన్నారు. గట్టు మరమ్మతులనిమిత్తం సొంత భూమిని ఇచ్చిన రైతులు ఆచంట లక్ష్మణరావు, సుబ్బారావులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఎర్రకాలువ పనులు పూర్తయితే సుమారు 25వేల ఎకరాలకు ముంపు నివారణ అవుతుందని అన్నారు. ఎర్రకాలువ ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ తదితరులకు, రైతుల తరఫున ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర కాలువ ఏఈ అనిల్ ఎమ్మార్వో రాజరాజేశ్వరి, భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ,అడప ప్రసాద్,బండారు నాగరాజు, ఆకుల తాతారావు నీటిసంఘం అధ్యక్షులు అడ్డగర్ల ప్రసాద్, నార్పిరెడ్డి వీరన్న గరగా విష్ణు ప్రియా,బాలం కృష్ణ , గంధం రామకృష్ణ,పాలూరి వెంకటేశ్వరరావు, సిద్ధ వీరన్న, చాపల రమేష్, మద్దాల మణికుమార్, గంధం ఏడుకొండలు, వాడపల్లి సుబ్బరాజు, పసుమర్తి రామ లక్ష్మణ్, నారపరెడ్డి దొరబాబు, పసల కొండ, బేతినగిరి, కూటమి నాయకులు పాల్గొన్నారు

# ఎక్సైజ్ శాఖలో పారదర్శక సంస్కరణలు

- నాణ్యత, ప్రజా రోగ్యానికి ప్రాధాన్యం
- రెండేళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం



**అమరావతి, (ఉషశ్రీ) మే 15:** రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో పారదర్శకత, నాణ్యత, టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం సంస్కరణలు అమలు చేస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత 23 నెలల కాలంలో ఎక్సైజ్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ వ్యవస్థలో జరిగిన అక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేసిన ప్రభుత్వం, ఎస్ఈబీని రద్దు చేసి ఎక్సైజ్ శాఖను ఏకీకృతం చేసింది. ఐజీ స్థాయి అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి మద్యం అక్రమాలపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. 2024-26 నూతన మద్యం పాలసీ కింద లాటరీ విధానంలో మద్యం దుకాణాలను కేటాయించడం ద్వారా పారదర్శకత పెంచినట్లు పేర్కొంది. ఈ ప్రక్రియలో దాదాపు 90 వేల దరఖాస్తులు రావడంతో ప్రభుత్వానికి రూ.1800 కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపింది. ఎన్నికల హామీ మేరకు 10 శాతం మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించిన ప్రభుత్వం, మొత్తం 354 షాపులను వారికి ఇచ్చినట్లు వెల్లడించింది. గతంలో అమలులో ఉన్న [illegible] విధానాన్ని రద్దు చేసి ప్రజలపై ఉన్న అదనపు భారం తగ్గించిందని పేర్కొంది. మద్యం విక్రయాల్లో డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యం పెంచిన ప్రభుత్వం, గతంలో 0.6 శాతంగా ఉన్న డిజిటల్ చెల్లింపులు ప్రస్తుతం 45 శాతానికి చేరుకున్నాయని తెలిపింది. ట్రాక్ అండ్ ట్రేస్ విధానం, ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ప్రతి మద్యం బాటిల్‌ను పర్యవేక్షించే విధానం అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి మద్యం బ్యాచ్‌పై 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, చిత్తూరు, కర్నూలులో అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, ప్రతి నెల సగటున 30 వేల నమూనాలను పరీక్షిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రీమియం మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎమ్మార్పీ విధానం, సీసీ కెమెరా పర్యవేక్షణ వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు వివరించింది. గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన ప్రభుత్వం, నాసిరకం బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజారోగ్యంతో చెలగాటమాడిందని ఆరోపించింది. డిజిటల్ లావాదేవీలను నిరోధించడం, అక్రమ రవాణాకు అవకాశం కల్పించడం వంటి చర్యలతో ఎక్సైజ్ వ్యవస్థ దెబ్బతిన్నదని పేర్కొంది. రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రజలకు నాణ్యమైన మద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, డిస్టిలరీల నుంచి షాపుల వరకు ప్రతి దశలో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డిజిటల్ లావాదేవీల పెరుగుదల ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

# రక్తదానం అన్ని దానాలకంటే గొప్పది : సీఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న




**విజయవాడ, (ఉషశ్రీ )మే 15:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయని ప్రశంసించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం చేపడుతూ జిల్లా కమిటీ ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. కమిటీ సేవా కార్యక్రమాలను చూసి ప్రభావితుడై తాను స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం అన్ని దానాలకంటే గొప్పదని, ఒక మనిషి ప్రాణాన్ని కాపాడే శక్తి రక్తదాతలకే ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ జి. సమరం మాట్లాడుతూ రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్త కొరత లేకుండా ఉండేందుకు యువత పెద్ద సంఖ్యలో రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సమాజ సేవే రెడ్ క్రాస్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రెడ్ క్రాస్ తరచూ శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. సీఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న స్వయంగా రక్తదానం చేయడం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒకసారి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



# సర్ ఆర్థర్ కాటన్ ఆశయాలు చిరస్మరణీయం: మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళి

**(నిడదవోలు ) నిడదవోలు:** గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి, కోటి ఎకరాల మాగాణానికి జీవనాడిని అందించిన నిస్వార్థ ప్రజా సేవకుడు, అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ 223వ జయంతి సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ఘన నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కాటన్ దొర సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... గోదావరి డెల్టాకు జీవం పోసి, ఈ ప్రాంత రైతాంగానికి నూతన దిశానిర్దేశం చేసిన మహోన్నత దార్శనికుడు సర్ ఆర్థర్ కాటన్ అని అభివర్ణించారు. అప్పటి ఆంగ్ల ప్రభుత్వంతో పోరాడి, వారిని ఒప్పించి.. ఇక్కడి ఆంధ్రుల హృదయాలను మెప్పించిన గొప్ప నాయకుడు ఆయన అని కొనియాడారు. రాజమహేంద్రవరం సమీపంలోని ధవళేశ్వరం వద్ద కాటన్ దొర నిర్మించిన ఆనకట్టను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. దశాబ్దాల క్రితం ఆయన చూపిన చొరవ వల్లే నేడు లక్షలాది మందికి సాగు, తాగునీరు అందుతోందని, నాటి ఆయన కృషి నేటికీ కోట్లాది మందికి జీవనాధారంగా నిలిచిందని అన్నారు. ఒక బ్రిటీష్ అధికారి అయ్యుండి కూడా స్థానిక ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన కాటన్ దొరను తెలుగు ప్రజలు తమ గుండెల్లో గుడి కట్టుకున్నారని తెలిపారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రతి ఏటా ఆయన జయంతి, వర్ధంతి ఉత్సవాలను ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహించుకోవడమే ఆయన గొప్పతనానికి నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.



## పోలవరం నిర్మాణంపై చిత్తశుద్ధి ఉంది

# నిర్వాసితులపై అభిమానం ఉంది



- నిర్వాసితుల కోసమే పోలవరం జిల్లా
- 23 నెలల్లో రూ.2,250 కోట్లు నిర్వాసితులకు చెల్లించాం....
- పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం....
- చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాకే మా సమస్యల పరిష్కారంపై నమ్మకం వచ్చింది: పోలవరం నిర్వాసితులు



**అమరావతి, (ఉషశ్రీ )మే 15**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై చిత్తుశుద్ధి ఉందని... పోలవరం నిర్వాసితుల పట్ల అభిమానంతో ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం పుట్టపర్తి పర్యటన ముగించుకుని అమరావతి చేరుకున్న అనంతరం క్యాంప్ కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. పోలవరం నిర్వాసితులకు రూ.306.61 కోట్ల పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని సీఎం చంద్రబాబు అందించారు. అలాగే పలువురు లబ్దిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో ఇళ్ల తాళాలను అందించారు. ఇళ్ల పట్టాల నిమిత్తం 62.05 ఎకరాలు, ల్యాండ్ టూ ల్యాండ్ కింద 520.02 ఎకరాలను గుర్తించినట్టు అధికారులు వెల్లడించారు. 23 నెలల్లో ఇప్పటికే మూడు దఫాలుగా నిర్వాసితులకు పరిహారం అందించిన సీఎం... శుక్రవారం నాలుగో విడతలో మరికొంతమంది నిర్వాసితులకు పరిహారం అందించారు. 2025 ఏడాదిలో సంక్రాంతి, దీపావళీ సందర్భంగా రెండు సార్లు 2026 ఏడాదిలో ఉగాది సందర్భంగా మూడోసారి, ఇవాళ కాటన్ దొర జయంతి సందర్భంగా నాలుగో విడత పోలవరం నిర్వాసితులకు ముఖ్యమంత్రి పరిహారం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్ల పరిహారాన్ని పోలవరం నిర్వాసితులకు చెల్లించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కాటన్ దొర జయంతి రోజున పోలవరం నిర్వాసితులతో సమావేశం కావడం... ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులు ఇవ్వడం ఆనందంగా ఉంది. సంక్రాంతి, దీపావళి, ఉగాది ఇలా పండుగలకు పోలవరం నిర్వాసితులకు నిధులు అందిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద కమిట్మెంట్ ఉంది.. నిర్వాసితుల మీద అభిమానం ఉంది. ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదు.. ఇబ్బందులు పడకూడదనేదే నా ఆలోచన. పోలవరం నిర్వాసితులు కోసమే పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. టెక్నాలజీ అనుసంధానం చేసి ప్రతీ కుటుంబ ఆదాయం పెంచుతాం. గిరిజన నియోజకవర్గాలైన పోలవరం, రంపచోడవరంను అన్ని విధాలా తీర్చిదిద్దుతాం. పోలవరం ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తవుతుంది. నిర్వాసితుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగదు. ప్రాజెక్టు, టౌన్ షిప్, ఇండస్ట్రీ ఇలా ఏం వచ్చినా త్యాగం చేసేది రైతులే. వారసత్వంగా వచ్చిన భూములు పోతే బాధపడతారు... నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వను. రంపచోడవరంలో బ్రహ్మాండమైన రోడ్లు నిర్మిస్తున్నాం. 2022లో వరదల సమయంలో పోలవరం ప్రాంతంలో నేను పర్యటించాను. వరద బాధితులకు కనీసం భోజనం, నీళ్లు కూడా నాటి ప్రభుత్వం ఇవ్వలేదు. విశాఖలో హుద్ హుద్ వచ్చినప్పుడు వారం రోజులు అక్కడే ఉండి పరిస్థితి చక్కదిద్దాం. 2019 కూడా తర్వాత మా ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2020కి పూర్తయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం, నిర్లక్ష్యం వల్ల డయా ఫ్రమ్ వాల్ దెబ్బతినేలా చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేశారు. గత పాలకులు అధికారులను మార్చారు... కాంట్రాక్టరును మార్చారు... ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం... 2027 పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకిత చేస్తాం. గోదావరి – కావేరి నదుల అనుసంధానం జరుగుతుంది. గంగా – కావేరి నదుల అనుసంధానం కావాలనేది నా కోరిక. ఇది చేస్తే దేశంలో నీటి ఎద్దడి అనేది ఉండదు"అని ముఖ్యమంత్రి అన్నారు

**చంద్రబాబు సీఎం అయ్యాకే మాకు మంచి రోజులు: నిర్వాసితులు:** సీఎం చంద్రబాబు పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖిలో నిర్వాసితులు తమ అభిప్రాయాలను... క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. గతంలో పరిహారం, ఆర్ అండ్ ఆర్ పనులు ఎలా ఉండేవి.. ఇప్పుడు ఎలా జరుగుతున్నాయనే అంశాన్ని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమ పరిహారం మీద తాము పూర్తిగా నమ్మకాన్ని కోల్పోయామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మీద... తమకు అందే పరిహారం మీద నమ్మకం కలిగిందని నిర్వాసితులు చెప్పారు. చంద్రబాబు సీఎం అయ్యాకే... 23 నెలల కాలంలో నాలుగు విడతలుగా పరిహారం చెల్లింపులు జరుపుతున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో కూడా గత పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్వాసితులు వివరించారు. పోలవరం నిర్వాసితులకు డబ్బులివ్వలేనని... తాను ఏం చేయలేనని నాటి సీఎం జగన్ చెప్పడంతో తాము ఆందోళన చెందామని పోలవరం నిర్వాసితులు వివరించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు గత ప్రభుత్వం రోడ్లు కూడా వేయలేదని పలువురు ముంపు గ్రామాల ప్రజలు సీఎంకు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్వాసితులుగా తమను పట్టించుకోకపోవడమే కాకుండా... వరదల సమయంలో సర్వం కోల్పోయిన తమకు కనీసం బియ్యం పంపిణీ కూడా చేపట్టలేదంటూ నాడు జరిగిన సంఘటనలను సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జలవనరుల శాఖ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలవరం జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే బండారు పుట్టినరోజు వేడుకలు



**( ఆత్రేయపురం )** కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలను ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ర్యాలి గ్రామ పార్టీ టిడిపి అధ్యక్షులు పెండం వెంకన్న ఆధ్వర్యంలో కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వారికి బిస్కెట్లు పళ్ళు బ్రెడ్ అందజేశారు. అలాగే ఊబలంక మదర్ థెరీసా, మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు దివ్యాంగులకు భోజనాలు అందజేసి వారికి తినిపించి, వారి చేత ఎమ్మెల్యే జన్మదిన కేకును కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. గ్రామాభివృద్ధి, రహదారులు, తాగునీటి సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఎమ్మెల్యే సత్యానందరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఉన్నత పదవులు అధిరోహించాలని, మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరి సుబ్బారావు, పాలంగి రవిచంద్ర, మెర్ల నాగేశ్వరరావు, గుడెల్ల నాగేంద్ర, గార్లపాటి గోపి, గూడపాటి శ్రీను, మద్దూరు సత్యనారాయణ, నామల శ్రీను, బందెల శ్రీను, మండపాక సత్తిబాబు, షేక్ గౌస్, రామకృష్ణ, రమేష్, అత్తిలి వెంకట్, పెద్దకాపు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి మెమొంటోలు అందజేత...** రావులపాలెంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కొత్తపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి, విద్యార్థినులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి నాయకులు విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు గుత్తుల రాంబాబు మాట్లాడుతూ మండలంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సేవలో ముందుండే స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేస్తూ ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రావులపాలెం బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, తెలుగుయువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజు,గుత్తుల రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారు ఆయురారోగ్యాలతో విలసిల్లాలి

- ఆత్రేయపురంలో అంబరాన్నంటిన ఎమ్మెల్యే పుట్టినరోజు సంబరాలు...
- ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లొల్ల లాకుల వద్ద బ్లడ్ క్యాంప్ ఏర్పాటు...
- ఆత్రేయపురం మండలం అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు కృషి అమోఘం...



**( ఆత్రేయపురం )** కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా ఆత్రేయపురం మండలంలో సంబరాలు అంబరాన్నంటాయి. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణ రాజు, వాడపల్లి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, అనపర్తి తెలుగుదేశం నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ తదితర నాయకులు ముందుగా కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే బండారు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత లొల్ల లాకుల వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 62 మంది వరకు పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఆత్రేయపురం మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణ రాజు సైతం రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నాయకులు కార్యకర్తల కోలాహలం మధ్య భారీ కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఎమ్మెల్యే బండారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని, ప్రజాక్షేత్రంలో ప్రజల ఆదరాభిమానాలను మరింతగా సాధించాలని, వారికి సేవ చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెదేపా మండల పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణరాజు మాట్లాడుతూ గత రెండేళ్లలో ఆత్రేయపురం మండల అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. వాడపల్లి దివ్య క్షేత్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటుగా అక్కడికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. వసంత వాడ వద్ద 4 నియోజకవర్గాలకు తాగునీరు అందించే అమర జీవి జలధార పనులకు శంకుస్థాపన చేశారని తెలియజేశారు. డ్రాగన్ పడవల పోటీలు నిర్వహించి ఆత్రేయపురం ఘనతను ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. వేడుకల్లో భాగంగా కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు కార్యకర్తలందరికీ భోజన ఏర్పాట్లు చేశారు.

# సీఎస్కే ఆర్సీబీ భారీ స్కెచ్

- సీఎస్కేలో ఖలీల్ స్థానంలో కుల్దీప్ యాదవ్ చేరిక
- ఆర్సీబీలో తుషారా ప్లేసులో రిచర్డ్ గ్లీసన్ ఎంపిక
- గాయాలతో సీఎస్కే జట్టు తీవ్రంగా దెబ్బతింది
- ప్లేఆఫ్స్‌కు ముందు జట్లు స్క్వాడ్ బలోపేతం
- గ్లీసన్ టీ20 అనుభవం పై ఆర్సీబీ ఆశలు

ఐపీఎల్ 2026 కీలక దశకు చేరుకున్న వేళ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తమ స్క్వాడ్‌లో మార్పులు చేశాయి. వరుస గాయాలతో సతమతమవుతున్న సీఎస్కే, ఖలీల్ అహ్మద్ స్థానంలో పేసర్ కుల్దీప్ యాదవ్‌ను రూ. 30 లక్షలకు ఒప్పందం చేసుకుంది. మరోవైపు, డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ.. ఫిట్‌నెస్ సమస్యలతో తప్పుకున్న శ్రీలంకకు చెందిన నువాన్ తుషారా స్థానంలో ఇంగ్లాండ్ పేసర్ రిచర్డ్ గ్లీసన్‌ను రూ. 1.6 కోట్లకు చేర్చుకుంది. రిచర్డ్ గ్లీసన్‌కు ఉన్న అపారమైన టీ20 అనుభవం ఆర్సీబీ బౌలింగ్‌కు బలాన్నిస్తుందని ఫ్రాంఛైజీ భావిస్తోంది. ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ సమీపిస్తున్న వేళ.. టాప్‌లో నిలిచిన జట్లు కొత్త ఆటగాళ్లతో జట్లను మరింత పటిష్టం చేసుకుంటున్నాయి. గాయపడి టోర్నీకి దూరమైన ఆటగాళ్ల ప్లేసులో మరో ఆటగాడిని జట్టులో చేర్చుకుంటున్నాయి. ఈ జాబితాలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు నిలిచాయి. ఇదివరకే గాయపడ్డ ఓవర్టన్ ప్లేసులో.. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ డియాన్ ఫోరెస్టర్‌ను తీసుకున్న సీఎస్కే.. మరో రీప్లేస్‌మెంట్‌ను ప్రకటించింది. ఇదే సమయంలో ఆర్సీబీ.. తమ స్క్వాడ్‌లోకి ఇంగ్లండ్ పేసర్ రిచర్డ్ గ్లీసన్ తీసుకుంది. నిజానికి చెన్నై సూపర్ కింగ్స్ జట్టును ఈసారి గాయాల బెడద తీవ్రంగా వేధిస్తోంది. నాథన్ ఎల్లిస్, ఖలీల్ అహ్మద్, ఆయుష్ మాత్రే, రామకృష్ణ ఘోష్ జెమీ ఓవర్టన్ గాయాల కారణంగా టోర్నీకి దూరమయ్యారు. స్పెన్సర్ జాన్సన్, డివాల్డ్ బ్రెవిస్ కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేకుండా పోయారు. మహేంద్ర సింగ్ ధోనీ కూడా గాయం కారణంగా ఇప్పటివరకు ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ సీజన్‌లో చివర్లో బలంగా పుంజుకుని.. ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్.. గాయపడ్డ పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌ను తీసుకుంది. రూ. 30 లక్షలకు కుల్దీప్‌తో ఒప్పందం కుదిరినట్టు సోషల్ మీడియాలో ప్రకటించింది. కాగా కుల్దీప్ గతంలో ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. తాజాగా సీఎస్కేలో చేరిపోయాడు. జెమీ ఓవర్టన్ ప్లేసులో దక్షిణాఫ్రికా కుర్రాడు డియాన్ ఫోరెస్టర్ కూడా ఇటీవల సీఎస్కేలో చేరడం గమనార్హం. మరోవైపు డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ కూడా జట్టులో మార్పులు చేసింది. ఫిట్‌నెస్ టెస్టులో విఫలమై.. ఐపీఎల్ 2026కు దూరమైన శ్రీలంకకు చెందిన నువాన్ తుషారా ప్లేసులో ఇంగ్లాండ్‌కు చెందిన రిచర్డ్ గ్లీసన్‌ను తీసుకుంది. రూ. 1.6 కోట్లకు అతడిని దక్కించుకుంది. 2022లో అరంగేట్రం చేసిన గ్లీసన్.. ఇంగ్లాండ్ తరఫున ఆరు టీ20లు ఆడాడు. ఫ్రాంఛైజీ క్రికెట్‌లో మాత్రం 145 మ్యాచ్‌లలో 170 వికెట్లు తీశాడు.



## ముంబై దెబ్బకు సీన్ రివర్స్..



ఐపీఎల్ 2026 లీగ్ దశ ముగింపుకు చేరుకున్నా, ప్లే ఆఫ్స్ బెర్తులపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. 58 మ్యాచులు ముగిసే సమయానికి ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ 16 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉండి.. ప్లే ఆఫ్స్‌కు అత్యంత చేరువలో ఉన్నాయి. గురువారం ముంబై ఇండియన్స్ చేతిలో పంజాబ్ కింగ్స్ ఓడిపోవడంతో.. పంజాబ్ ప్లే ఆఫ్స్ ఆశలు దెబ్బతినగా, చెన్నై సూపర్ కింగ్స్ (56.3%), రాజస్థాన్ రాయల్స్ (57%) అవకాశాలు మెరుగయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ తన మిగిలిన రెండు మ్యాచుల్లో గెలిస్తే టాప్-2లో నిలిచే అవకాశం ఉంది. ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగుతోంది. లీగ్ స్టేజ్‌లో ఇప్పటికే 58 మ్యాచులు ముగిసిపోయాయి. మరో 12 మ్యాచులు మిగిలి ఉన్నాయి. అయితే ఇప్పటికీ ఒక్క జట్టు కూడా ప్లే ఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకోలేదు. రెండు జట్లు మాత్రం ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించాయి. మిగతా 8 జట్లు టాప్-4లో నిలిచేందుకు శ్రమిస్తున్నాయి. అయితే గురువారం పంజాబ్ కింగ్స్‌ను ఓడించిన ముంబై ఇండియన్స్.. ప్లే ఆఫ్స్ సమీకరణాలను మార్చేసింది. ఐపీఎల్ 2026లో 58వ మ్యాచ్ తర్వాత ప్లే ఆఫ్స్ అవకాశాలు ఏ జట్టుకు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం..

పాయింట్స్ టేబుల్‌లో తొలి రెండు స్థానాల్లో ఉన్న ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్.. దాదాపుగా ప్లే ఆఫ్స్ చేరినట్లే. ఈ జట్ల ఖాతాల్లో చెరో 16 పాయింట్లు ఉన్నాయి. మరోవైపు టాప్-2లో నిలిచేందుకు ఆర్సీబీకి 81.9%, గుజరాత్ టైటాన్స్ 79.1% అవకాశాలు ఉన్నాయి. సన్ రైజర్స్ హైదరాబాద్: ఈ జట్టు ప్లే ఆఫ్స్ చేరేందుకు 79.7% అవకాశం ఉంది. ఇందులోనూ టాప్-2లో నిలిచేందుకు 36% అవకాశాలు ఉన్నాయి. మిగిలిన రెండు మ్యాచులలో గెలిస్తే సన్ రైజర్స్ టాప్-2లో నిలిచే అవకాశం ఉంది. పంజాబ్ కింగ్స్: ముంబై ఇండియన్స్ చేతిలో ఓటమితో పంజాబ్ అవకాశాలు దెబ్బతిన్నాయి. ఆ జట్టు వరుసగా ఐదు మ్యాచులలో ఓడిపోయింది. పంజాబ్ ప్లే ఆఫ్స్ చేరేందుకు 43.8% అవకాశం ఉంది. టాప్-2లో నిలిచేందుకు 8.3% ఛాన్స్ ఉంది. చెన్నై సూపర్ కింగ్స్: పంజాబ్ చేతిలో ముంబై ఓడమితో సీఎస్కే అవకాశాలు గణనీయంగా పెరిగిపోయాయి. ఆ జట్టు టాప్-4లో నిలిచేందుకు 56.3% అవకాశం ఉంది. టాప్-2లో నిలిచేందుకు 22.2% ఛాన్స్ ఉంది. రాజస్థాన్ రాయల్స్: టాప్-4లో నిలిచేందుకు రాజస్థాన్ రాయల్స్‌కు 57% అవకాశం ఉంది. పాయింట్స్ టేబుల్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచేందుకు ఆ జట్టుకు 17.9% ఛాన్స్ ఉంది.ఏఇక కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్ గణాంకాల ప్రకారం ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నప్పటికీ అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ప్లే ఆఫ్స్ చేరేందుకు కేకేఆర్‌కు 3.7%, ఢిల్లీ క్యాపిటల్స్‌కు 4.2% అవకాశాలు ఉన్నాయి. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ఎలిమినేట్ అయిపోయాయి.



# కార్తిక్ కిర్రాక్ షో..
# దూబే పవర్ ఫినిషింగ్



లక్నోలోని ఏకనా స్టేడియంలో లక్నోతో జరుగుతున్న కీలక మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కేకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (13), సంజూ శాంసన్ (20), ఉర్విల్ పటేల్ (6) స్వల్ప వ్యవధిలోనే ఔట్ కావడంతో జట్టు కష్టాల్లో పడింది. ఈ దశలో యంగ్ ప్లేయర్ కార్తిక్ శర్మ (71) అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. చివర్లో శివమ్ దూబే (16 బంతుల్లో 32రి) మెరుపులు మెరిపించాడు. ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగుపర్చుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ సవాల్ విసిరే స్కోరు చేసింది. లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కే.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు స్కోరు చేసింది. యంగ్ ప్లేయర్ కార్తిక్ శర్మ మరోసారి సత్తాచాటాడు. 42 బంతుల్లో 71 పరుగులు చేసి జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్.. ఏమాత్రం ఆలోచించకుండా బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని ఆ జట్టు బౌలర్లు నిలబెట్టారు. కీలక మ్యాచ్‌లో సీఎస్కే ఓపెనర్లు విఫలమయ్యారు. రుతురాజ్ గైక్వాడ్ 9 బంతుల్లో 13 రన్స్, సంజూ శాంసన్ 20 బంతుల్లో 20 రన్స్ చేసి ఔట్ అయ్యారు. వన్ డౌన్‌లో వచ్చిన ఉర్విల్ పటేల్ కూడా నిరాశపరిచాడు. 7 బంతుల్లో 6 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. దీంతో చెన్నై సూపర్ కింగ్స్ కష్టాల్లో పడింది. ఈ సమయంలో కార్తిక్ శర్మ.. డివాల్డ్ బ్రెవిస్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించాడు. నాలుగో వికెట్‌కు 44 బంతుల్లో 70 రన్స్ జోడించారు. దీంతో సీఎస్కే కోలుకుంది. చివర్లో వీరిద్దరూ ఔట్ కావడంతో ఆ జట్టు స్కోరు వేగం కాస్త నెమ్మదించింది. పవర్ హిట్టర్‌గా పేరున్న శివమ్ దూబె .. తొలుత తన దైన శైలిలో బ్యాట్ ఝుళిపించలేకపోయాడు.కానీ చివర్లో మాత్రం చెలరేగిపోయాడు. 2 సిక్సులు, 3 ఫోర్లతో 16 బంతుల్లో 32 రన్స్ చేశాడు. దీంతో సీఎస్కే.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 రన్స్ స్కోరు చేసింది. ఇక లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లలో ఆకాశ్ మహరాజ్ సింగ్ 3 వికెట్లతో సత్తాచాటాడు. మహమ్మద్ షమీ 1, శాబాజ్ అహ్మద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. కాగా ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టు.. ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగుపర్చుకోవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవాల్సిందే. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన లక్నో సూపర్ జెయింట్స్.. పెద్దగా కోల్పోయేది ఏమీ లేదు. దీంతో ఆ జట్టు ఎలాంటి ఒత్తిడి లేకుండా బ్యాటింగ్ చేయనుంది.

# ‘లక్నో’ గండం.



ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినప్పటికీ, టోర్నీలో అత్యంత కీలకమైన జట్టుగా మారింది. ఆ జట్టు ఆడబోయే తదుపరి మూడు మ్యాచులు (సీఎస్కే, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌తో) ప్లే ఆఫ్స్ సమీకరణాలను పూర్తిగా మార్చేయనున్నాయి. ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగనున్న రిషభ్ పంత్ సేన, గెలవాల్సిన ఒత్తిడిలో ఉన్న ప్రత్యర్థి జట్ల ఆశలపై నీళ్లు చల్లగలదు. ముఖ్యంగా శుక్రవారం లక్నోతో జరిగే మ్యాచ్ సీఎస్కేకు ప్రతిష్టాత్మకం. ఈ మ్యాచులో గెలిస్తేనే సీఎస్కే ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగుపడతాయి. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. అయితే ఆ జట్టు ఇంకా మూడు మ్యాచులు ఆడాల్సింది. ప్లే ఆఫ్స్ చేరే అవకాశం లేకపోవడంతో లక్నో మ్యాచులపై పెద్దగా ఆసక్తి ఉండదని అంతా భావిస్తారు. కానీ ఐపీఎల్ 2026లో మాత్రం అలా జరగడం లేదు. ఇప్పటివరకు ఈ సీజన్‌లో 58 మ్యాచులు పూర్తయ్యాయి. ఒక్క ప్లే ఆఫ్ బెర్తు కూడా ఇంకా ఖరారు కాలేదు. ఆర్సీబీ, గుజరాత్ ప్లే ఆఫ్స్‌కు చేరువయ్యాయి. సన్ రైజర్స్ కూడా మెరుగైన అవకాశాలు కలిగి ఉంది. ఇక మిగిలిన ఒక్క ప్లేసు కోసం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య పోటీ నెలకొంది. సరిగ్గా ఇవే జట్లతో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఇప్పుడు మ్యాచులు ఉన్నాయి. శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్ జట్టు.. చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచులో ఓడిపోయినా ఆ జట్టుకు పెద్దగా పోయేది ఏమీ లేదు. కానీ సీఎస్కే కథ వేరు. ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరాలంటే ఈ మ్యాచులో గెలవడం ముఖ్యం. లక్నో సూపర్ జెయింట్స్ మే 19న రాజస్థాన్ రాయల్స్‌తో, మే 23న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ రెండు జట్లది కూడా సీఎస్కే పరిస్థితే. ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగనున్న లక్నో సూపర్ జెయింట్స్.. ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ చేరే జట్ల భవితవ్యాన్ని నిర్ణయించనుంది. ఒకవేళ ఈ మూడు మ్యాచులలోనూ లక్నో సూపర్ జెయింట్స్ గెలిస్తే మాత్రం.. ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసు మరింత రసవత్తరంగా మారనుంది. అప్పుడు చివరి లీగ్ మ్యాచ్ పూర్తయ్యే వరకు ప్లే ఆఫ్స్ బెర్తులు ఖరారు కావు. ఈ నేపథ్యంలో టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటీ లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచులపై క్రికెట్ అభిమానులు ఆసక్తిచూపిస్తున్నారు. మరి రిషభ్ పంత్ టీమ్.. ఏ జట్టు ప్లే ఆఫ్స్ ఆశలపై నీళ్లు చల్లుతుంది.. ఏ జట్టును ప్లే ఆఫ్స్ చేర్చుతుంది.. అనేది మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

## రక్తపాతం చిందిస్తున్న

# ‘డీసీ’ ట్రైలర్




స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ హీరోగా నటిస్తున్న డీసీ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో క్రైమ్ యాక్షన్ సన్నివేశాలతో పాటు హీరోయిన్ వామికా గబ్బితో ఉన్న ఎమోషనల్ లవ్ డ్రామా కూడా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. రాకీ, సాణికాయిదం, కెప్టెన్ మిల్లర్ వంటి సినిమాలను తెరకెక్కించిన అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఇందులో లోకేశ్ కనగరాజ్ దేవదాస్ అనే పాత్రలో నటిస్తుండగా, వామికా గబ్బి చంద్ర పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, తాజాగా వచ్చిన ట్రైలర్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. మానగరం సినిమాతో డైరెక్టర్ గా పరిచయమైన లోకేశ్ కనగరాజ్, ఆ తర్వాత ఖైదీ సినిమాతో మరో స్థాయికి చేరుకున్నారు. అనంతరం రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు తెరకెక్కించారు. చివరిగా ఆయన తెరకెక్కించిన కూలీ సినిమా మంచి వసూళ్లు సాధించింది. ప్రస్తుతం డైరెక్టర్ గా ఉన్న లోకేశ్ కనగరాజ్, డీసీ సినిమాతో హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాలో సంజనా, వామికా గబ్బి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వేలంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ అయిన గ్లింప్స్ వీడియోలో సంజనా సిగరెట్ తాగుతూ కనిపించగా, ఆ గదిలోకి లోకేశ్ ప్రవేశించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక తాజాగా రిలీజైన ట్రైలర్ ప్రారంభంలోనే కారులో ఒక మహిళ భయంతో కేకలు వేస్తున్న సన్నివేశం కనిపిస్తుంది. ఆ తర్వాత తుపాకీ కాల్పులు, రక్తపాతం, హై వోల్టేజ్ యాక్షన్ సీన్స్‌తో ట్రైలర్ మొత్తం ఉత్కంఠభరితంగా సాగుతుంది. డబ్బు కోసం తమ కుమార్తెను తప్పుదారి పట్టించే తల్లిదండ్రుల నుంచి చంద్రను దేవదాస్ ఎలా కాపాడతాడు అన్నదే సినిమా కథ అని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ట్రైలర్ చివర్లో ఆమె పేరు చంద్రరా.. అంటూ ఓ బూతు పదంతో ముగుస్తుంది. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌లో అనేక అసభ్య పదాలు ఉండటంతో వాటిని మ్యూట్ చేశారు. దీంతో సినిమా మొత్తం ఎలా ఉండబోతుందనే ఆసక్తితో పాటు కొంత సందేహం కూడా అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే.

# కొత్త వెలుగునిచ్చిన మాళవిక



ఈ అందమైన చిత్రంలో నటి మాళవిక మోహనన్ నారింజ రంగు చీరతో పాటు ముదురు ఆకుపచ్చ బ్లౌజ్‌లో ఎంతో ఆకర్షణీయంగా కనిపించారు. సంప్రదాయ శిల్పం పక్కన రాతి స్తంభానికి ఆనుకుని చిరునవ్వుతో నిలిచిన ఆమె రూపం అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. “అందమైన చెన్నైలో ఒక అందమైన రోజు” అంటూ ఆమె అభిమానులతో ఈ ఆనంద క్షణాన్ని పంచుకున్నారు. ఆమె చిరునవ్వు చెన్నై నగరంలోని ప్రశాంతతను, ఆ నగరంతో ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించింది. పనుల నిమిత్తం తరచూ చెన్నైకి వెళ్లే మాళవికకు ఆ నగరంతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆగస్టు 4, 1993న జన్మించిన మాళవిక మోహనన్ 2013లో విడుదలైన మలయాళ చిత్రం పట్టం పోలే ద్వారా సినీ రంగంలో అడుగుపెట్టారు. అనంతరం బియాండ్ ది క్లౌడ్స్ చిత్రంతో విస్తృత గుర్తింపు పొందారు. తర్వాత పేట్టా, మాస్టర్, క్రిస్టీ, తంగలాన్ వంటి చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల 2025లో విడుదలైన హృదయపూర్వం చిత్రంలో మోహన్‌లాల్ సరసన నటించి మరో విజయాన్ని అందుకున్నారు. అలాగే 2026లో విడుదలైన ది రాజా సాబ్ ద్వారా ప్రభాస్ సరసన తెలుగు సినీ రంగంలోకి ప్రవేశించారు. ఇక ఆమె చేతిలో ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులు ఉన్నాయి. సర్దార్ 2 చిత్రంలో కార్తితో కలిసి నటిస్తుండగా, దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న క్రైమ్ డ్రామా పాకెట్ నవెల్లో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆ చిత్రంలో విజయ్ సేతుపతి కూడా నటిస్తున్నారు. అందం, అభినయం, సౌమ్యత కలగలిపిన మాళవిక మోహనన్ దక్షిణ భారత సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటూ మరింత మెరవుతున్నారు.

# చిరంజీవి, విజయ్.. సర్ ప్రైజ్ కాల్!



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న విజయ్ కి ఇప్పుడు దేశవ్యాప్తంగా సినీ స్టార్స్ నుంచి విషెస్ అందుతున్నాయి. ఊహించని విధంగా మొదటి అడుగులోనే సీఎం సీటు ఎక్కి అందరిని ఆశ్చర్య పరిచిన విజయ్ తన స్టార్ హోదా ఏమిటో మరోసారి నిరూపించారు. ఇక మెగాస్టార్ చిరంజీవి ఫోన్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ఒకరు వెండితెరను దశాబ్దాలుగా ఏలుతున్న హీరో అయితే, మరొకరు సినిమాల్లో సత్తా చాటి ఇప్పుడు ప్రజా క్షేత్రంలో కీలక పదవిలో ఉన్న నేత వీరిద్దరి మధ్య సాగిన ఈ ఆత్మీయ సంభాషణ తెలుగు, తమిళ రాష్ట్రాల్లో అందరి దృష్టిని ఆకర్షించింది. విజయ్ సీఎం అయ్యాక జరిగిన ఈ తొలి అధికారిక పలకరింపుకు ఇప్పుడు చాలా ప్రాధాన్యత పెరిగింది. విజయ్ పాలన దివంగత నేత ఎం.జి.ఆర్ గారి లాగే సాగాలని చిరంజీవి కోరుకున్నారు. ప్రజల కోసం చేసే పనుల్లో విజయ్ తనదైన ముద్ర వేయాలని, అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని చిరంజీవి అభినందించారు. ఒక సీనియర్ నటుడిగా చిరంజీవి ఇచ్చిన ఈ బూస్టప్ విజయ్ కి ఎంతో బలాన్నిచ్చేదే. ప్రజా సేవలో విజయ్ మరిన్ని సక్సెస్ లు చూడాలని చిరంజీవి తన మనసులోని మాటను చెప్పారు. అలాగే విజయ్ కూడా మెగాస్టార్ మీద తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇటీవల చిరంజీవి నటించిన “మన శంకర వర ప్రసాద్ గారు” సినిమా చూశానని విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. చిరంజీవిని మళ్ళీ ఆ రేంజ్ పాత్రలో స్క్రీన్ మీద చూడటం చాలా హ్యాపీగా అనిపించిందని విజయ్ అనడం విశేషం. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా తన తోటి నటుడి సినిమా గురించి స్పెషల్ గా ప్రస్తావించడం ఫ్యాన్స్ ని ఖుషీ చేస్తోంది. శుభాకాంక్షలతోనే ఆగిపోకుండా చిరంజీవి నెక్స్ట్ ప్రాజెక్టుల గురించి కూడా విజయ్ ఆరా తీశారు. ప్రస్తుతం కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మెగాస్టార్ చేస్తున్న కొత్త సినిమాకు విజయ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇండస్ట్రీ వ్యక్తులు ఇలాంటి ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు ఇలాంటి పలకరింపులు సినిమా రంగానికి ఒక రకమైన భరోసానిస్తాయి. భాష ఏదైనా ఒకరి సినిమాలను ఒకరు గౌరవించుకోవడం ఒక మంచి పద్ధతి. నిజానికి గతంలో కూడా తెలుగు, తమిళ స్టార్ల మధ్య మంచి బాండింగ్ ఉండేది. ఇప్పుడు విజయ్ ముఖ్యమంత్రి కావడంతో ఆ బంధం ఇంకా స్ట్రాంగ్ అయ్యే ఛాన్స్ ఉంది. చిరంజీవి, విజయ్ మధ్య జరిగిన ఈ టాక్ కేవలం రాజకీయ సంబంధం మాత్రమే కాదు, ఒక మంచి ఫ్రెండ్ షిప్ అని ఫ్యాన్స్ చెబుతున్నారు. పాలిటిక్స్ వేరైనా కళాకారులుగా వారి మధ్య ఉన్న రెస్పెక్ట్ ఏమాత్రం తగ్గలేదని ఈ ఇన్సిడెంట్ తో అర్థమవుతోంది. ఇక ఇద్దరు సూపర్ స్టార్లు ఇలా మాట్లాడుకోవడం అటు మెగా ఫ్యాన్స్ కి, ఇటు విజయ్ ఫ్యాన్స్ కి పెద్ద కిక్ ఇచ్చింది. రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలు ఇంకా మెరుగుపడటానికి ఇలాంటి ఆత్మీయ కలయికలు బాగా హెల్ప్ అవుతాయి. మెగాస్టార్, సీఎం విజయ్ ల ఈ స్నేహం ముందు ముందు ఇంకెన్ని ఇంట్రెస్టింగ్ పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# బ్లాక్ గౌనులో సెగలు పుట్టిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్!



ఇటీవల కాలంలో సెలబ్రిటీలు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా తన గ్లామర్ తో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఒకవైపు సినిమా షూటింగ్ లతో ఎంత బిజీగా ఉన్నా మరొకవైపు ఫాలోవర్స్ ను, నెటిజన్స్ ను ఆకట్టుకోవడానికి ఇలా వరుస ఫోటోషూట్స్ తో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రముఖ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన అందాల సోయగాలతో మరొకసారి అభిమానులను మైమరిపింపచేసే ప్రయత్నం చేసింది .

**బ్లాక్ అవుట్ ఫిట్ లో గ్లామర్ లుక్ ఇచ్చిన రకుల్..** అందులో భాగంగానే ఇంస్టాగ్రామ్ వేదికగా తాజాగా పంచుకున్న ఈ అవుట్ ఫిట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఫ్యాషన్ ప్రియులకు ఇదొక ట్రెండీ ఔట్ఫిట్ గా నిలిచింది .అందులో గ్లామర్ వలకబోస్తూ షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ బ్లాక్ గౌన్ కి పర్ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా సిల్వర్ కలర్ బ్లాక్ కలర్ ఫింగర్ రింగ్స్ ధరించిన ఈమె.. జుట్టును వేవ్ లా వదిలేసి సింపుల్ స్మైల్ తో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఫ్రాక్ కి తగ్గట్టుగా బోసి నెక్ తో.. నడుము మీద చెయ్యి పెట్టి వయ్యారంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. మరికొన్ని ఫోటోలలో సెల్ఫీతో ఆకట్టుకుంది. మొత్తానికి రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఈ ఫోటో గ్యాలరీ అభిమానులను ఆకట్టుకుంటుంది.

**థియేటర్లోకి వచ్చిన రకుల్ కొత్త సినిమా..** ఇదిలా ఉండగా ప్రస్తుతం బాలీవుడ్ లోనే వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా నటించిన చిత్రం పతి పత్నీ ఔర్ దో.. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరో ఆయుష్మాన్ ఖురానా, రకుల్ ప్రీత్ సింగ్ , సారా అలీ ఖాన్, వామికా గబ్బిలు హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాను టీ సిరీస్, బి.ఆర్ స్టూడియోస్ బ్యానర్లపై రేణు రవి చోప్రా, కృష్ణన్ కుమార్ , భూషణ్ కుమార్ లు సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా వచ్చిన ఈ సినిమాకి ముదసర్ అజీజ్ దర్శకత్వం వహించారు. విజయ రాజ్, దుర్గేష్ కుమార్, దీపిక అమీన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ సినిమా. ఈ సినిమా మొదటి షో తోనే మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకోవడం విశేషం.

**రకుల్ ప్రీత్ సింగ్ కెరియర్..** కెరటం సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన రకుల్ ప్రీత్ సింగ్.. వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. తర్వాత పలువురు టాలీవుడ్ స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందుకున్న ఈ బ్యూటీ.. కెరియర్ పీక్స్ లో ఉండగానే మన్మథుడు వంటి చిత్రంలో నటించి విమర్శలు ఎదుర్కొంది. ఇక ఇప్పుడు బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ బిజీగా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తూ అక్కడ వరుస విజయాలను అందుకుంటూ తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా తన నటనకు తగ్గట్టుగా అవార్డుల రూపంలో గౌరవాలను కూడా అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.

# ఆంధ్రావాలా ఫ్లాపవుతుందని ముందే

టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై తీవ్ర నిరాశ మిగిల్చిన సినిమాల లిస్ట్ లో జూనియర్ ఎన్టీఆర్- పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన ఆంధ్రావాలా పేరు ఇప్పటికీ ప్రత్యేకంగా వినిపిస్తుంటుంది. 2004లో రిలీజైన ఈ సినిమా అప్పట్లో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత హైప్ క్రియేట్ చేసిన ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఫస్ట్ లుక్ నుంచి ఆడియో వరకు అభిమానుల్లో విపరీతమైన అంచనాలు పెంచిన ఈ సినిమా, రిలీజ్ తర్వాత మాత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మారింది. తాజాగా ఈ సినిమాపై ప్రముఖ ఎడిటర్ కె. మార్తాండ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఆంధ్రావాలా సినిమా అండర్ ప్రొడక్షన్‌లో ఉన్నప్పుడే ఇది వర్కౌట్ కావడం కష్టమని చెప్పాను. కానీ దర్శకుడు పూరీ జగన్నాథ్ వినలేదని చెప్పడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఒక పెద్ద సినిమా నిర్మాణ దశలోనే దాని ఫలితం గురించి టెక్నీషియన్లు అంచనా వేయడం ఆసక్తికరంగా మారింది. ఇండస్ట్రీలోని చాలామందికి స్క్రిప్ట్ దశలోనే ఒక ప్రాజెక్ట్ భవిష్యత్తుపై క్లారిటీ వచ్చేస్తుందని ఇండస్ట్రీలో తరచూ అంటూంటారు. కొంతమంది డైరెక్టర్లు లేదా నిర్మాతలు కథ వర్కౌట్ కాదని భావిస్తే అక్కడికక్కడే ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తారు. మరికొందరు షూటింగ్ ప్రారంభమైన తర్వాత లోపాలు గుర్తించి స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తూ సినిమాను కొత్త దారిలో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో పరిస్థితులు పూర్తిగా చేతిలో లేకపోవడంతో టెక్నీషియన్లు కేవలం తమ బాధ్యతను పూర్తి చేయడానికే పరిమితమవుతారు. మార్తాండ్ వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆయన చెప్పినట్లుగా, సినిమా ఫలితం ఎలా ఉండబోతుందో తెలిసినా, ఒకసారి భారీ స్థాయిలో షూటింగ్ ప్రారంభమైన తర్వాత దాన్ని ఆపడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతుంటుంది. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాల్లో అభిమానుల అంచనాలు, నిర్మాతల పెట్టుబడులు, మార్కెట్ ఒత్తిళ్లు కలిసి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంటాయి. ఆంధ్రావాలా విషయంలో కూడా అలాంటి పరిస్థితులే నెలకొన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఆంధ్రావాలా ఫ్లాప్‌తో ముగిసిపోయిన ఈ కాంబినేషన్, దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ కలసి టెంపర్ రూపంలో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా జూనియర్ ఎన్టీఆర్ కెరీర్‌కు కీలక మలుపుగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్, డైలాగ్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న టెంపర్ భారీ విజయాన్ని అందుకుని ఎన్టీఆర్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ముఖ్యంగా ఆ సినిమా తర్వాత ఎన్టీఆర్ ఎంపిక చేసుకున్న కథలు, నటనలో వచ్చిన మార్పు ఆయన కెరీర్‌ను కొత్త దిశగా మలిచాయి. ప్రస్తుతం మార్తాండ్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతుండగా, అభిమానులు మాత్రం ఆంధ్రావాలా నుంచి టెంపర్ వరకు ఈ కాంబో ప్రయాణాన్ని మరోసారి గుర్తుచేసుకుంటున్నారు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN